# సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024




**ట్రిపుల్ ఐటీలో గుత్తాధిపత్యం**
బాసర ట్రిపుల్‌ఐటీ అనతికి కేరాఫ్‌గా మారింది. అధికారగణం కాంట్రాక్టర్ల సేవలో తరిస్తున్నారన్న విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. 8లో



**రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం** 9లో
ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు.

గరిష్టం/కనిష్టం
29.2/24.2

**వాతావరణం**
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తుపాను ప్రభావంతో జిల్లా అంతటా జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 'భట్టి' పర్యటన రద్దు

**జైపూర్/చెన్నూర్‌రూరల్:** మంచిర్యాల జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం పర్యటించాల్సి ఉండగా.. ఆకస్మికంగా పర్యటన రద్దయింది. రోజువారీ కార్యక్రమాల్లో ఆలస్యం, ఖమ్మం జిల్లా, డిప్యూటీ సీఎం సొంత నియోజకవర్గం మధిరలో భారీ వర్షాల కారణంగా పర్యటన రద్దు చేసుకున్నారు. పెద్దపల్లి జిల్లాకు హెలికాప్టర్‌లో చేరుకున్న ఆయన అక్కడి పర్యటన ముగిసిన తర్వాత రోడ్డు మార్గాన అక్కడి నుంచే అటే వెళ్లిపోయారు. కాగా, జైపూర్‌లోని ఎస్టీపీపీలో ప్రారంభోత్సవాలు, సందర్శన, చెన్నూర్ మండలం శివలింగాపూర్‌లో సోలార్‌పవర్ ప్లాంటు ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలు వాయిదా పడ్డాయి.

### జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకోవాలి

**ఆదిలాబాద్‌టౌన్ :** నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా అన్నారు. శనివారం ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ కాం ఎక్స్‌ప్రెస్ డెలివరీ బాయ్స్ కోసం జాబ్ మేళా నిర్వహించారు. సర్టిఫికెట్లను పరిశీలించి పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధికారి మిల్కా మాట్లాడుతూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం నుంచి ప్రతీనెల రెండు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**ఆదిలాబాద్‌టౌన్:** వృద్ధులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సంక్షేమాధికారి సబిత అన్నారు. శనివారం కేఆర్కే కాలనీలోని వృద్ధాశ్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఉండే వారు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, సెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సురేందర్, సునీత, సమాఖ్య ప్రధాన కార్యదర్శి రాం కులకర్ణి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

**ఎదులాపురం:** నిత్యవసర ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలన్నారు. ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### డీపీఆర్వోపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

**కైలాస్‌నగర్:** జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో) తిరుమలపై యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, నాయకులు ప్రకాష్ శనివారం కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి మీడియా సమావేశానికి కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏర్పాట్లు చేయాలని ముందుగానే సమాచారమిచ్చినా పట్టించుకోలేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆయన అరగంట పాటు బయటే నిలబడేలా చేసిన డీపీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ విషయాన్ని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.




మట్టి వినాయక విగ్రహాలు

రూపుదిద్దుకుంటున్న గణనాథుడు

# మట్టిమేలు తలపెట్టి..

- పర్యావరణ మిత్రులు నకాష్ కళాకారులు
- ఏళ్లుగా పర్యావరణ హిత వినాయకుల తయారీ
- కుల వృత్తిని కొనసాగిస్తూనే.. జీవనోపాధి కల్పిస్తూ..



మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న కళాకారుడు

**ఆదిలాబాద్:** వారంతా సాధారణంగా అందరిలాగే తమ జీవనోపాధిగా వివిధ వృత్తులు నిర్వహిస్తున్నారు. అయితే వినాయక, శ్రీ దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో తమకు వంశపారంపర్యంగా వచ్చిన కళను కొనసాగిస్తారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ విగ్రహాల తయారీలో నిమగ్నమైపోతారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు మొదలు మూడు నెలల నుంచే ఇంటిల్లిపాది మట్టితో దేవతామూర్తులను తయారుచేసి సుందరంగా తీర్చిదిద్దుతారు. తరతరాలుగా వస్తున్న తమ సంప్రదాయ వృత్తిని కొనసాగిస్తూ, భావితరాలకు వారి కళను వారసత్వంగా అందిస్తున్నారు. అయితే లాభాల మాట అటుంచితే తమ కళను కాపాడుకోవాలనే తాపత్రాయమే వారిలో కనిపిస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఇప్పటికీ మట్టి విగ్రహాలను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా పరోక్షంగా తోడ్పాటును అందిస్తున్న ఈ నకాష్ కళాకారులు అభినందనీయులే. వారి కళతో పాటు ప్రకృతిని పరిరక్షిస్తున్న ఆ కళాకారుల అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం...

### కులవృత్తిని కాపాడుకుంటున్నాం



మా పూర్వీకుల నుంచి వచ్చిన కులవృత్తిని కొనసాగిస్తున్నాం. మార్కెట్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. అయితే మా తాతలు ఇచ్చిన ఈ కళను యధావిధిగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. మూడు దశాబ్దాలుగా విగ్రహాలు తయారు చేస్తున్నా. గతంతో పోలిస్తే ప్రస్తుతం మట్టి విగ్రహాలను పూజించడానికి భక్తులు ముందుకు వస్తున్నారు. మా కులవృత్తిని పరిరక్షించుకోవాలనే ఆలోచనతోనే విగ్రహాల తయారీని వీడట్లేదు.

– బ్రహ్మరౌతు యువరాజ్, ఆదిలాబాద్

### స్థలం కేటాయించాలి



ఆదిలాబాద్ పట్టణంలో సుమారు 50 కుటుంబాల వరకు ఉంటాయి. నవరాత్రుల్లో తప్పకుండా విగ్రహాల తయారీలోనే నిమగ్నం అవుతాం. స్థలభావంతో విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో తయారు చేయలేకపోతున్నాం. స్థలం ఇవ్వాలని అనేక ఏళ్లుగా విజ్ఞప్తులు చేస్తున్నాం. అయితే ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. దీంతో లక్షలు కిరాయి ఇస్తూ వేరే ప్రాంతాల్లో విగ్రహాలు తయారు చేయాల్సి వస్తోంది. విగ్రహాలు అమ్ముడుపోతే లాభాలు వస్తున్నప్పటికీ అమ్మకాలు లేని సమయాల్లో లక్షలు నష్టపోయి, అప్పులు చేయాల్సి వస్తోంది. వారసత్వ కళను నమ్ముకుంటున్న మాలాంటి కళాకారులను ప్రోత్సహించాలి.

– బి.పద్మ, అశోక్ రోడ్, ఆదిలాబాద్

### ఇదే మా జీవనాధారం



చిన్ననాటి నుంచి విగ్రహాలు తయారు చేస్తున్నా. శ్రేష్టమైన నల్లని మట్టిని మాత్రమే ఉపయోగిస్తాం. చెరువులు, పంట చేలలో నుంచి మట్టిని కొనుగోలు చేసుకుని తీసుకువచ్చి, దేవతామూర్తులను తయారు చేస్తాం. ఒక్కో విగ్రహం ఆకారం పరిమాణం డిజైన్ బట్టి రూ.300 నుంచి రూ.3వేల వరకు ధర పలుకుతుంది. సుమారుగా ప్రతీ సీజన్‌లో 250 విగ్రహాల వరకు చేస్తాం. కొన్ని సందర్భాల్లో మట్టి దొరకక ఇబ్బందులు వస్తున్నాయి. నేను స్ప్రేపెయింటర్‌గా పనిచేస్తున్నా. పని ఉన్నప్పుడు మాత్రమే వేతనం ఉంటుంది. ఇదే మా జీవనాధారం. ప్రభుత్వం అండగా నిలవాలి.

– వేణుగోపాల్, అశోక్ రోడ్, ఆదిలాబాద్

### కళాకారులను ప్రోత్సహించాలి



రాజస్థాన్ వంటి ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన పలువురు కళాకారుల వలన మా ఉపాధి దెబ్బతింటోంది. పీవోపీ విగ్రహాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుండడంతో మట్టి విగ్రహాలపై అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. అయినప్పటికీ మా వృత్తిని మా తల్లిదండ్రుల నుంచి వచ్చిన వారసత్వాన్ని కాపాడుకుంటున్నాం. మట్టి దొరకని సమయంలో మహారాష్ట్ర నుంచి తీసుకొస్తున్నాం. ఖర్చులు పెరిగిపోతున్నప్పటికీ ధరలు మాత్రం అంతే స్థాయిలో ఉంటున్నాయి. మట్టినే నమ్ముకుని సంప్రదాయ ప్రాచీన కళ అస్తిత్వాన్ని కాపాడుతున్నాం. మాలాంటి స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తే, మరింత గొప్పగా విగ్రహాల తయారీ చేపడతాం.

– మహేష్, అశోక్ రోడ్, ఆదిలాబాద్

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ రాజర్షి షా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

**కైలాస్‌నగర్:** రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందువల్ల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వర్షాల అప్రమత్తతపై రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, మున్సిపల్, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న సమయాల్లో ప్రజలు వాటిని దాటవద్దని కోరారు. ప్రాజెక్టులు ఓవర్‌ఫ్లో అయితే గేట్లు ఎత్తివేసి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడం జరుగుతుందన్నారు. వర్షానికి కూలిపోయే దశలో ఉన్నటువంటి పాత భవనాలు, ఇళ్లు, గోడలను ముందుగానే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవి, సీపీవో వెంకట రమణ, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు రెడ్ అలర్ట్

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం

**కైలాస్‌నగర్:** వాతావరణశాఖ ఆదిలాబాద్ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి, రానున్న రెండు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ రాజర్షి షా అప్రమత్తంగా ఉండాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌తో పాటు ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పాటు తెగిపోయే అవకాశమున్నందువల్ల ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలోనూ కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. 24గంటల పాటు సేవలందించేలా వాటికి ప్రత్యేకంగా ఉద్యోగులను నియమించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నంబర్ 18004251939ను సంప్రదించాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ శాఖ కంట్రోల్ రూమ్ 8106128195, ఇరిగేషన్ కంట్రోల్ రూమ్ 91873226050 నంబర్లలో సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

## గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

**ఆదిలాబాద్‌టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, కామర్స్, అరబిక్, హిందీ, హిస్టరీ సబ్జెక్టుల్లో ఒక్కొక్కటి, పొలిటికల్ సైన్స్ 2 సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులున్నవారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 4లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకుంటే 6న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**సైన్స్ కళాశాలలో...**

ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.జె.సంగీత ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, ఉర్దూలో ఒకటి చొప్పున, హిందీలో 2, జువాలజీలో 3, జువాలజీ ఉర్దూ మాధ్యమంలో 1 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల4లోగా దరఖాస్తులు సమర్పించి, 6న జరిగే డెమోకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు .

## పత్తిసాగుపై క్షేత్ర సందర్శన

**ఆదిలాబాద్‌టౌన్ :** ఆదిలాబాద్ పట్టణం రాంనగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో సాగు చేస్తున్న అధిక సాంద్రత పత్తిపంటను శనివారం నాగ్‌పూర్ జాతీయ పత్తి పరిశోధన సంస్థ డైరెక్టర్ వైజి.ప్రసాద్ ఆధ్వర్యంలో క్షేత్రసందర్శన నిర్వహించారు. పత్తి సాగులో వివిధ కంపెనీల హైబ్రీడ్ రకాలు, వాటి గుణగణాలు, రాబోయే కాలంలో విడుదలయ్యే బీటీ రకాలను పరిశీలించారు. ఆస్ట్రేలియాలో చేపడుతున్న యాంత్రీకరణ పత్తి సాగు, పాలిమల్చింగ్ సాగులో పత్తి సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వై.ప్రవీణ్ కుమార్, కేవీకే శాస్త్రవేత్త డా. కే.రాజశేఖర్, రాంప్రసాద్, మోమన్‌దాస్, తదితరులు ఉన్నారు.

## మరో తొమ్మిది మీసేవలు

- మాన్యువల్ విధానానికి స్వస్తి
- ఇకపై ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్ల జారీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి




సీసీఎల్‌ఏ జారీ చేసిన ఉత్తర్వులు

**కైలాస్‌నగర్:** వివిధ ప్రభుత్వ శాఖలు అందించే సేవలను ప్రజలకు త్వరితగతిన, సులభంగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, రిజిస్ట్రేషన్లు వంటి 36 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 360 రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తోంది. అయినప్పటికీ రెవెన్యూ శాఖ ద్వారా ఇప్పటికీ పలు రకాల సేవలను మాన్యువల్‌గానే అందిస్తోంది. ఈ సేవలను పొందడంలో అటు దరఖాస్తుదారులకు, వాటి జారీలో రెవెన్యూ అధికారులకు తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం మ్యానువల్ విధానానికి పూర్తిగా స్వస్తి పలికింది. రెవెన్యూ శాఖ ద్వారా జారీ చేసే మరో తొమ్మిది రకాల సేవలను ఇకపై ఆన్‌లైన్‌లోనే మీ సేవ కేంద్రాల ద్వారా జారీ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) ఎన్.మాధవి దేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాటి అమలుకు జిల్లా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో సూచించారు. దీంతో మీ సేవ కేంద్రాల ద్వారా అందించే సేవల సంఖ్య 369కి చేరనుంది.

**తొమ్మిది రకాల సేవలు ఆన్‌లైన్‌లో...**

రెవెన్యూశాఖకు సంబంధించి అనేక రకాల సేవలు మీ సేవ కేంద్రాల ద్వారా జారీ చేస్తున్నప్పటికీ పలు సేవలు ఇప్పటికీ మాన్యువల్‌గానే అందిస్తున్నారు. గ్యాప్ సర్టిఫికెట్, పేరు మార్పు, లోకల్ క్యాండిడేట్, మైనార్టీ సర్టిఫికెట్, ఏడాది కాల పరిమితికి సంబంధించి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్, మార్కెట్ వాల్యూ, రెవెన్యూ ఓల్డ్ రికార్డ్సు (ఓల్డ్ కాస్రా, సెస్సల్ పహాణీ) ఆర్‌ఓఆర్‌-1బీ వంటి తొమ్మిది రకాల సేవలను మాన్యువల్‌గా అందిస్తున్నారు. ఆయా సర్టిఫికెట్లు అవసరమైన ప్రజలు మాన్యువల్‌గా దరఖాస్తు పత్రాన్ని నింపి అందుకు అవసరమైన డాక్యుమెంట్స్ జతచేసి సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేసేవారు. వాటిని రెవెన్యూ అధికారులు విచారించి, వాస్తవాలను ధృవీకరించిన అనంతరం సర్టిఫికెట్‌ను టైప్‌చేసి వాటిపై తహసీల్దార్ సిగ్నేచర్, కార్యాలయ స్టాంపును వేసి ప్రజలకు సర్టిఫికెట్లను జారీ చేసేవారు. ఇకపై ఈ మాన్యువల్ విధానం పూర్తిగా రద్దు కానుంది. ఈ తొమ్మిది రకాల సేవలను మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లోనే జారీ చేయనున్నారు.

**త్వరలోనే అమల్లోకి**

తహసీల్దార్ల ద్వారా మాన్యువల్ సేవలను ఇకపై మీ సేవ కేంద్రాల ద్వారానే జారీ చేయాలని సీసీఎల్‌ఏ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని త్వరితగతిన అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అందులో స్పష్టం చేశారు. ఈ సేవలను మీసేవ కేంద్రాల జాబితాలో చేర్చడంతో పాటు వాటిని ఆన్‌లైన్‌లో అందించేందుకు అవసరమైన సత్వర చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీంతో ఆయా తొమ్మిది రకాల సేవలు త్వరలోనే మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా మాన్యువల్ విధానానికి చెక్‌పడగా ప్రజలకు త్వరితగతిన, సులభంగా సేవలు అందనున్నాయి.

## గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు

- కలెక్టర్ రాజర్షి షా

**కైలాస్‌నగర్:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హిందూ సమాజ్ ఉత్సవ సమితి ప్రతినిధులు శనివారం కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఉత్సవ సమితి ప్రతినిధులకు సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంపెల్లి హన్మాండ్లు, కొరెడ్డి లెనిన్, సంఘటన మంత్రి ఇత్నూర్ భాస్కర్, కోశాధికారి ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, రాజ్‌కుమార్, జోగు రమేశ్, సభ్యులు కనక నర్సింగ్, తిరుమలేశ్, సాయి శ్రీనివాస్ ఉన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



నారాయణ దంపతులను సన్మానిస్తున్న డీఈవో

**గుడిహత్నూర్:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా విద్యాధికారి టామ్నె ప్రణీత అన్నారు. స్థానిక శివ కళ్యాణ మండపంలో ఎంఈవో నారాయణ పదవీ విరమణ సన్మాన సభకు హాజరై ఆమె మాట్లాడారు. తరగతి గదుల్లో దేశ నిర్మాతలను తయారు చేసే కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించడం అదృష్టమన్నారు. పదవీ విరమణ ప్రతీ ఉద్యోగికి సహజమే అయినప్పటికీ వారు అందించిన సేవలు సమాజంలో చిరస్థాయిగా గుర్తుంటాయన్నారు. అనంతరం సహచర ఉద్యోగులు నారాయణ అందించిన సేవలు గుర్తు చేశారు. ఆయన శేష జీవితం సాఫీగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంఈవో దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో ఉదయ్‌రావ్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు దేవిదాస్, సంతోష్ కుమార్, గోపాల్‌సింగ్ తిలావత్, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్.చౌహాన్



మాట్లాడుతున్న ఎస్‌ఈ జేఆర్.చౌహాన్

**ఆదిలాబాద్‌టౌన్:** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఈ జేఆర్.చౌహాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేసి లోపాలను సవరించాలన్నారు. యూనిక్ పోల్ నెంబరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కేబుల్, బ్రాడ్‌బ్యాండ్ ఆపరేటర్లను తమ కేబుల్స్‌ను విద్యుత్ స్తంభాలపై వేసేవారు క్రమపద్ధతిలో సరిచేసుకోవాలన్నారు. బ్రేక్‌డౌన్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. వ్యవసాయ సర్వీస్‌లకు సంబంధించిన విద్యుత్‌ను ఇవ్వడానికి అవసరమైన అంచనాలు, వర్క్‌ఆర్డర్లను త్వరగా మంజూరు చేయాలన్నారు. వినియోగదారుల బిల్లింగ్ ప్రక్రియను ఐఆర్‌డీఏ, ఓసీఆర్ పద్ధతిలో చేపట్టి మాన్యువల్ బిల్లింగ్‌ను తగ్గించాలన్నారు.

## ఉద్యోగ విరమణ అధికారులకు సన్మానం



ఎస్సైలను సన్మానిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

**ఆదిలాబాద్‌టౌన్:** పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వన్‌టౌన్ ఎస్సై సి.రామారావు, ఆదిలాబాద్ రూరల్ ఎస్సై మహమ్మద్ జహీరుద్దీన్‌లను శనివారం ఎస్పీ గౌస్ ఆలం సన్మానించారు. స్థానిక పోలీసు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సూచించారు. 40 ఏళ్ల కాలంలో వారు పోలీస్‌శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, కోశాధికారి గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, అధికారులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీలో గుత్తాధిపత్యం

- యూనివర్సిటీలో టెండరు లేకుండా కాంట్రాక్టర్లకు పనులు
- కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లయినా పాతవారినే కొనసాగింపు
- గత ప్రభుత్వం ఆదేశించినా మారని అధికారులు తీరు
- పనులు అప్పగించడం వెనుక భారీగా అక్రమాలు



ట్రిపుల్ఐటీ మెస్లో అప్పటి గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్(ఫైల్)

భైంసా: విద్యార్థులకు ఉన్నతమైన విద్యాబోధనతో భవిష్యత్కు బంగారు బాటలు వేయాల్సిన బాసర రాజీవ్గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) అవినీతికి కేరాఫ్గా మారింది. విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాల్సిన అధికారగణం కాంట్రాక్టర్ల సేవలో తరిస్తున్నారన్న విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. కాంట్రాక్టర్ల నజరానాలకు ఆశపడో.. నేతల ఒత్తిళ్లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా యూనివర్సిటీలో పనులు కేటాయిస్తున్నారు. ప్రభుత్వంలో ఏదైనా కాంట్రాక్టు అంటే గడువు ఉంటుంది. ఆ గడువు ముగియగానే నిర్వహణ, వివిధ పనుల కోసం టెండరు నిర్వహించి కొత్తవారిని నియమించాలి. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ, బాసర ట్రిపుల్ ఐటీ అధికారులు కాంట్రాక్టర్లు చెప్పిందే వేదంగా భావిస్తూ పాటిస్తున్నారు. కాంట్రాక్టు గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా పాతవారినే కొనసాగిస్తున్నారు. పాతవారిపై పలు ఆరోపణలున్నా.. వారి సేవలోనే తరిస్తున్నారు. ఇలా ఒకటి రెండు విషయాల్లో కాదు యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ఉన్న ప్రైవేటు సంస్థల అన్ని కాంట్రాక్టు గడువులు ముగిసినా ఇంకా కొనసాగించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి కొన్ని సంస్థలపై ఫిర్యాదులు ఉన్నా చర్య తీసుకోకపోవడం, వెంటనే టెండర్లు నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ట్రిపుల్ఐటీ సమస్యలు తెలుసుకునేందుకు అప్పటి గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఇక్కడికి చేరుకుని మెస్లు, పరిసరాలు, వసతిగృహాలు తనిఖీ చేశారు. విద్యార్థులతో



ట్రిపుల్ఐటీ పరిసరాలు పరిశీలిస్తున్న అప్పటి గవర్నర్ తమిళసై (ఫైల్)



వసతిగృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న అప్పటి గవర్నర్ తమిళసై (ఫైల్)

మాట్లాడి పలు సూచనలు చేశారు. అయినా ఎలాంటి మార్పురాలేదు. గత ప్రభుత్వ మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్రెడ్డి యూనివర్సిటీని సందర్శించిన సమయంలో ఆదేశించినా అధికారుల తీరు మారలేదు. పాతవారికే గడువు పెంచుతూ వస్తున్న అధికారులు వేసవిసెలవుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. టెండర్ వేస్తే ఏడాది కాలానికి కాంట్రాక్ట్ వస్తుంది కానీ ఇక్కడ అధికారులు కాంట్రాక్టర్లకు మూడు ఏళ్ల నుంచి రెన్యూవల్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రూ.కోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి

## జరుగుతుంది ఇదీ..

- యూనివర్సిటీలో హౌస్ కీపింగ్ కాంట్రాక్టు గడువు ముగిసింది. గడువు కంటే రెండు నెలల ముందుగానే టెండరు ప్రక్రియ ముగించి కొత్త వారిని అధికారులు సిద్ధం చేయాలి. కానీ మూడేళ్లు గడిచినా పాతవారినే కొనసాగిస్తున్నారు. సరైన సమయానికి వేతనాలు ఇవ్వక, వారికి రావాల్సిన ప్రయోజనాలు అందజేయకపోవడంతో ప్రస్తుతం ఉన్న సంస్థ తీరును నిరసిస్తూ కార్మికులు ఆందోళనలు చేశారు.
- క్యాంపస్లోని సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహించే కంపెనీ కాంట్రాక్టు గడువు సైతం మూడేళ్ల క్రితమే ముగిసింది. ఇంకా సదరు కంపెనీనే అధికారులు కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీలో 9 వేల మంది విద్యార్థులు ఉండగా వారి భోజన బాధ్యతలు, నిర్వహణను అధికారులు ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలకు అప్పగించారు. ఈ మూడు క్యాటరింగ్ సంస్థల కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లు అవుతోంది. కానీ అధికారులు ఇప్పటి వరకు టెండర్లు పిలవడం లేదు. అనేకసార్లు విద్యార్థుల భోజనంలో పురుగులు రావడం, ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి పలు క్యాటరింగ్ సంస్థలపై అనేక ఫిర్యాదలు వచ్చాయి. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టెండర్ లేకుండా పాతవారినే వారినే కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీ పరిపాలన అవసరాల కోసం మ్యాన్ పవర్ను అందించే సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లవుతుంది. ఇంకా వారినే కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీలో సూపర్మార్కెట్, హాస్టల్ భవనాల్లోని జనరల్ స్టోర్స్ ఎలాంటి టెండరు లేకుండా అధికారుల బంధువులకు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి ఇవి అక్రమంగా కొనసాగుతున్నట్లు సమాచారం. అద్దె కూడా చెల్లించడం లేదని తెలిసింది. వీటిపై అనేక ఫిర్యాదులు ఉన్నా అధికారులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.
- ఈ కాంట్రాక్టు సంస్థలు, యూనివర్సిటీకి మధ్య ఏడాదిలో రూ.60 నుంచి రూ.90 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయి. పెద్ద ఎత్తున జరిగే ఈ కాంట్రాక్టులు టెండర్ లేకుండా కొనసాగించడానికి అదే స్థాయిలో అవినీతి జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

### త్వరలోనే అన్ని టెండర్లు పిలుస్తాం..

యూనివర్సిటీలో గడువు ముగిసి పలు కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త టెండర్లు పిలవడంతో కొంత జాప్యం జరిగింది. గడువు ముగిసిన అన్ని కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త టెండర్ ఫైళ్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం. అవి రెడీ కాగానే కొత్త టెండర్లు పిలిచి కాంట్రాక్టు అప్పగిస్తాం.

– ప్రొఫెసర్ వెంకటరమణ, ఇన్చార్జి వీసీ

## క్లుప్తంగా

### ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విష్ణుకుమార్తో హెచ్ఎం, పీడీ

కాసిపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి బానోతు విష్ణుకుమార్ ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సాంబమూర్తి తెలిపారు. క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం మందమర్రి మండలం బొక్కలగుట్టలో జిల్లాస్థాయి అండర్–14 ఫుట్బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. విష్ణుకుమార్ ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని, పీడీ భుక్య రాజన్నను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ స్వరూప, ఉపాధ్యాయులు అభినందించారు.

### పంటచేలో నెమలి అప్పగింత



ఎఫ్బీవోకు నెమలిని అప్పగిస్తున్న రైతు

దిలావర్పూర్: పంట చేలల్లో ఉన్న నెమలిని రైతులు అటవీ అధికారులకు అప్పగించారు. శనివారం దిలావర్పూర్లోని పంట చేలలో రైతులు రవి, శ్రీకాంత్ పనులు చేస్తుండగా నెమలి అరుపులు వినిపించాయి. దగ్గరకు వెళ్లి చూడగా నడవలేని స్థితిలో ఉండడంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్బీవో మీనా అక్కడికి చేరుకోగా నెమలిని అప్పగించారు. దానికి చికిత్స చేయించి అటవీప్రాంతంలో వదిపెడుతామన్నారు. అటవీ శాఖ వాచర్లు ఆలంఖాన్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

### మొరం ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న మొరం ట్రాక్టర్లు

ఖానాపూర్: పట్టణ శివారులో అక్రమంగా తరలిస్తున్న మూడు మొరం ట్రాక్టర్లను పక్కా సమాచారంతో శనివారం పట్టుకున్నామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఎవరైనా అక్రమంగా మొరం తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

### ఏటీఎం చోరీకి యత్నించిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్టౌన్: పట్టణంలోని శాంతినగర్లోని ఎస్బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించిన నిందితుడు అందెరే సునీల్ను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు వన్టౌన్ సీఐ సునీల్కుమార్ తెలిపారు. నార్నూర్ మండలం బొప్పారానికి చెందిన నిందితుడు గురువారం రాత్రి ఏటీఎంలోకి చొరబడి చోరీకి యత్నించారు. సీసీ ఫుటేజీ పరిశీలించి గుర్తించారు. శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు బస్టాండ్ ఎదుట సునీల్ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు సీఐ పేర్కొన్నారు.

## కెలిబి శివారులో పులి పాదముద్రలు!



పులి పాదముద్రలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెలిబి శివారులో మొహర్లే రమేశ్, ప్రకాశ్లకు చెందిన పొలాల సమీపంలో ఉన్న చెరువు వద్ద గురువారం పులి పాదముద్రలు కనిపించాయి. ఐదారు రోజులుగా పొలంలో అరక దున్నుతున్నప్పుడు ఎద్దు చెరువు వద్దకు వెళ్లగానే వెనక్కు మళ్లుతున్నాయని, ఇదేమిటని శనివారం చెరువువద్ద వెళ్లి చూడగా పందిని హతమార్చినట్లు తెలిసిందని రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎఫ్ఆర్వో మజారోద్దీన్కి తెలుపగా అటవీ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి చూశారు. పులి పాదముద్రలుగా గుర్తించి, మూడు రోజుల క్రితం ఏర్పడినవని తెలిపారు. పులి సంచారం విష యం సమీప గ్రామాల ప్రజలకు దావానంలా వ్యా పించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పలు సూచనలు ఇస్తామని ఎఫ్ఆర్వో తెలిపారు. అధికారులు ప్రవంతి, వందన, నజీర్అలీ, జమీర్, గౌసుద్దీన్ ఉన్నారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్నగర్రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నారని కాగజ్నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. పట్టణంలోని కాపువాడ, భట్పల్లి చౌరస్తా వద్ద శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వంద బైక్లు, మూడు ఆటోలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫ్లెఓవర్ బ్రిడ్జి కింద గంజాయి సేవించే యువకులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. మట్కా, ఆన్లైన్ బెట్టింగ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ సీఐ శంకరయ్యతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల బృందాలు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న సమన్వయకర్త సుజయ్సర్కార్

భైంసా: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024లో జరగబోయే కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని కార్యక్రమ సమన్వయ కర్త సుజయ్సర్కార్ విద్యార్థులకు సూచించారు. శనివారం బాసర ట్రిపుల్ఐటీలో విద్యార్థులతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమలు, ఇతర సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు విద్యార్థుల బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. 108 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారని తెలిపారు. ఆరుగురు విద్యార్థులతో ఒక్కోబృందం ఏర్పాటై సమస్యలకు పరిష్కార మార్గం చూపించాలన్నారు. ఇందుకోసం ట్రిపుల్ ఐటీలో చదివే విద్యార్థుల బృందాలను ఎంపిక చేశామని తెలిపారు. త్వరలోనే పరిశ్రమల ప్రతినిధులు, జ్యూరీ మెంబర్లు రెండవ రౌండ్లో ఇందులో ప్రతిభ ఉన్నవారినే ఎంపికచేస్తారని తెలిపారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ సాఫ్ట్వేర్ ఎడిషన్ను సులభతరం చేసేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఓ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో భాగంగా బృందాలుగా ఏర్పడిన విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు ఇస్తే సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. స్టూడెంట్ ఇన్నోవేషన్ కేటగిరి కింద మూడు నగదు బహుమతులు ఇస్తారని అన్నారు. ప్రథమ బహుమతి కింద రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపారు. 2019, 2022లో రెండుసార్లు ట్రిపుల్ఐటీ విద్యార్థులు ప్రథమ బహుమతులు అందుకున్నారన్నారు. మళ్లీ ఈఏడాది ప్రథమస్థానంలో నిలవాలని సూచించారు. జ్యూరీ మెంబర్లు సీహెచ్ఓ డి.వెంకటరమణ, రాకేశ్రెడ్డి, నాగమణి, పీఆర్ఓ డా. విజయ్కుమార్తోపాటు పలువురు పాల్గొన్నారు.

## 'కాయిన్'దందాపై ఖాకీల దృష్టి

- పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

నిర్మల్: వివిధ 'కాయిన్'ల పేరిట భారీ పెట్టుబడులు పెట్టిస్తున్న దందాపై జిల్లా పోలీసులు దృష్టి పెట్టారు. ప్రస్తుతం మార్కెట్లో క్రిప్టో కరెన్సీకి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో వివిధ రకాల 'కాయిన్స్'పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇందులో చాలావరకు ఎలాంటి ఆధారాలు, వివరాలు ఇవ్వకుండా కేవలం ఆన్లైన్ ఆధారంగా దందా చేస్తున్నాయి. ఇవన్నీ చైన్లింక్ దందాలు కావడం, మొదట్లో లాభాలు బాగా ఇస్తుండటంతో చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా ఉపాధ్యాయులు, కిందిస్థాయి ఉద్యోగులు, ప్రైవేటువ్యాపారులు చైన్లింక్లను పెంచుకుంటూ పోతున్నారు.

**పోలీసుల అదుపులో..!?**

ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేని 'కాయిన్స్'దందాలను విస్తరిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఇందులో చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, వార్డెన్లు, ఉద్యోగులు, అధికారులు, వైద్యులు, కానిస్టేబుళ్లు ఉండటం గమనార్హం. కొందరు విధులకు వెళ్లకుండా ఈ వ్యాపారాన్నే చేస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నతాధికారుల వరకూ వెళ్లాయి. ఈనేపథ్యంలో శనివారం పలువురిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో పలువురు ఉపాధ్యాయులు, ఒకరిద్దరు అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఈ ఘటనపై పోలీసులు ఆదివారం వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

### రెండు బైక్లు ఢీ, ఒకరి మృతి



సుదర్శన్ మృతదేహం

నేరడిగొండ: మండలంలోని రోల్మామడ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రెండు బైక్లు ఢీకొని ఒకరు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..యాపల్గూడ గ్రామానికి చెందిన పెందూర్ సుదర్శన్(37) మేస్త్రీ పనుల కోసం ప్రతిరోజు బైక్పై వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం రాత్రి నేరడిగొండ నుంచి ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి రాయల్ ఎన్ఫీల్డ్ బైక్పై అతివేగంగా వచ్చి ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని ఎన్హెచ్ఏఐ అంబులెన్స్లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. భార్య లక్ష్మిబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



కాత్లే ప్రభు (ఫైల్)

గుడిహత్నూర్: మండలంలోని మాన్కాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కాత్లే ప్రభు మృతిచెందాడు. ఎస్సై ఇమ్రాన్ కథనం ప్రకారం..నార్నూర్ మండలం కంపూర్ గ్రామానికి చెందిన కాత్లే ప్రభు (43) గతేడాది క్రితం మాన్కాపూర్కు వచ్చి మాధవ్ వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్తుండగా ఉట్నూర్ నుంచి ఆదిలా బాద్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ప్రభును వెనుక నుంచి ఢీకొంది. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్కు తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

### జ్వరంతో విద్యార్థిని మృతి

వాంకిడి: మండలంలోని ఇందానికి చెందిన ఐశ్వర్య (17) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఐశ్వర్య గత వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుంది. తల్లిదండ్రులు మంగళ– భీమ్సన్ ఆమెను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కొన్నిరోజులు బాగానే ఉన్నా శుక్రవారం మళ్లీ అస్వస్థతకు గురైంది. శుక్రవారం రాత్రి మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

### ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



రక్షిత (ఫైల్)

ఉట్నూర్రూరల్: ఓ విద్యార్థిని చదువులో మంచి మార్కులు సాధిస్తూ ఉద్యోగం చేసి కుటుంబానికి ఆసరాగా నిలువాలని అనుకుంది. ఏం కష్టం వచ్చిందో ఏమో కాని ఆమె ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. నిజామాబాద్ జిల్లా రుద్రూర్లో వ్యవసాయ పాలిటిక్నిక్ కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉట్నూర్ మండలం హస్నాపూర్కు చెందిన విష్ణు–వనిత దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. విష్ణు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండో కుమార్తె లింగస్వాడ్ రక్షిత(17) నిజామాబాద్ జిల్లా రుద్రూర్లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం పొందింది. మూడు రోజుల క్రితమే కళాశాల వెళ్లింది. శనివారం బాత్రూంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి గల కారణాలు తెలియరాలేదు. రక్షిత మృతితో హస్నాపూర్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

### దేగాంలో మహిళ..

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన గంగధరోళ్ల సావిత్ర (48) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీనివాస్యాదవ్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. సావిత్ర బీడీ కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. భర్త పోతన్న మూడేళ్లుగా మద్యానికి బానిసై పని చేయడంలేదు. రోజు రోజుకు పోషణభారమై ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. మనస్తాపం చెందిన సావిత్ర శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

దండేపల్లి: గూడెం గ్రా మానికి చెందిన గోప తి రవి (42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్కిరణ్ తెలిపారు. ఆయ న కథనం ప్రకారం..రవి గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రి ఖర్చుల కోసం కొంత అప్పు చేశాడు. అయినప్పటికీ కడుపు నొప్పి తగ్గకపోవడం, పైగా వైద్యఖర్చుల కోసం అప్పులు కావడంతో మనస్తాపం చెందాడు. శనివారం పత్తిచేను వద్దకు వెళ్లి గుర్తుతెలియని పురుగు మందు తాగి ఇంటికి వచ్చి కుటుంబీకులకు విషయం చెప్పాడు. వెంటనే వారు ఆటోలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య సుమలత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

### అమ్మవారిని దర్శించుకున్న పీఠాధిపతి



భైంసా: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా బాసర సరస్వతి అమ్మవారిని సిద్ధాశ్రమ పీఠాధిపతి రాజయోగి సిద్ధేశ్వర మహారాజ్ దర్శించుకున్నారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం సిద్ధాశ్రమం నుంచి భక్తులతో కలిసి బాసరకు వచ్చారు. లోక కల్యాణార్థం సమస్థ శాంతికి, గోసంరక్షణకు అందరూ పాటుపడాలని కోరారు. అంతకుముందు ఆలయ అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించారు.

### హైకోర్టు న్యాయమూర్తుల పూజలు



భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని మహారాష్ట్రలోని ముంబయి, ఔరంగాబాద్ న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ముంబయి న్యాయమూర్తి నితిన్బి సూర్యవంశీ, ఔరంగాబాద్ న్యాయమూర్తి శేలేశ్ పి.బ్రహ్మేలు బాసరకు వచ్చారు. ఆలయ అధికారులు వారిని స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పూజలు చేసి అమ్మవారి దర్శించుకున్నారు. వేదపండితులు వారికి తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు.

## జిల్లా కళాకారిణికి గద్దర్ అవార్డు



పురస్కారం అందుకుంటున్న నర్సమ్మ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన సాంస్కృతిక సారథి కళాకారిణి నర్సమ్మ గద్దర్ అవార్డు అందుకున్నారు. గిద్దె గళం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ సౌజన్యంతో ఈ అవార్డు అందించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం స్వీకరించారు. గద్దర్ కుమార్తె వెన్నెల, ప్రొఫెసర్ కాశీం, గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ తదితరులు పాల్గొన్నారు.



అవార్డ్ అందుకుంటున్న పంబాల రమేశ్

**గద్దరన్న అవార్డు అందుకున్న పంబాల రమేశ్**

కడెం: మండలంలోని పాత మద్దిపడగ గ్రామానికి చెందిన జానపద కళాకారుడు పంబాల రమేశ్ గద్దరన్న అవార్డ్ను అందుకున్నాడు. ఈనెల 30న ఖమ్మం జిల్లా తొర్రూర్లో 'గిద్దెగళం' అధ్వర్యంలో గద్దరన్న అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం చేతుల మీదుగా రమేశ్ అవార్డు అందుకున్నారు. రమేశ్కు అవార్డు రావడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.